క్లుప్తంగా

చెన్నకేశవునికి ఆభరణాల అందజేత



ఆభరణాలు అందజేస్తున్న దాతలు

ఒంగోలు మెట్రో: కొప్పోలులోని కేశవక్షేత్రమైన చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి దేవస్థానంలో రెండు కేజీల 520 గ్రాముల రజిత పితాంబరం (వెండి పంచ), సూర్య కటారి (వెండి ఖడ్గం)ని ఆదివారం ఉదయం దాతలు సమర్పించారు. కొప్పోలు వాస్తవ్యులు నూనె జాలరామయ్య, విజయలక్ష్మి దంపతులు, నూనె శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతులు వాటిని అందించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం సమీర్ కుమార్ విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృతాభిషేకం, వాస్తు హోమం, సంప్రోక్షణ, సహస్రనామ పూజా క్రతువులను శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక భక్తులు, ఆలయ కార్యనిర్వహణాధికారి కట్టా సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఏకేయూ ప్రొఫెసర్‌కు అభినందనలు



వెంకటేశ్వరరెడ్డిని అభినందిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే చరిత్ర సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ చైర్మన్‌గా నియమితులైన ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కే మధుమూర్తి, తదితరులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రను విస్తృతంగా అధ్యయనం చేయాలని, ఎక్కువ రచనలు చేసి ప్రజలకు తెలియజేయాలని మధుమూర్తి ఆకాంక్షించారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ రాజ్‌మహమ్మద్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ గంగాధర్, డాక్టర్ సహదేవ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను విస్మరిస్తే పుట్టగతులుండవు

- మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణమ్మ



ఉడుముల అరుణమ్మ

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రజలనే కాకుండా మహిళలను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసం చేశారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల అరుణమ్మ అన్నారు. ఆదివారం ఆమె ప్రకటనలో తెలియజేస్తూ ఎన్నికల ముందు ఎన్నో అబద్ధపు వాగ్దానాలు చేసి వాటిని నిలపెట్టుకోవడం లో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలి అని అన్న మంత్రి అచ్చెన్నాయుడు ఉద్దేశం, వాటి వెనుక ఉన్న మర్మం ఏమిటని ఆమె ప్రశ్నించారు. కేవలం మహిళకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బూటకపు మాటలు అంటున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చి ఇంటింటా తిరుగుడిత బాండ్లు రాసిచ్చారని గుర్తు చేశారు. తీరా అధికారం చేపట్టగానే వాటిని అమలు చేయకుండా సహచర మంత్రులతో పథకాలు ఇవ్వలేమంటూ సుద్దపూస మాటలు చెప్పడం మహిళలను మరో మారు మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డ నిధి పథకం ద్వారా 19–50 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని ఎన్నికల ప్రసంగాల్లో ఉదరగొట్టి ఇప్పుడు ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మాలంటూ మంత్రి అన్నారంటే ప్రభుత్వం చేతగాని తననానికి నిదర్శనం అన్నారు. సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని కల్లిబొల్లి మాటలు చెప్పి అధికారం చేపట్టిన తరువాత పథకాలు అమలు సాధ్యం కాదని చెప్పడం మహిళా లోకాన్ని మోసం చేయడమేనన్నారు. గతంలో పనిచేసిన రాష్ట్ర మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కరోనా సమయంలో రాష్ట్రం క్లిష్ట పరిస్థితిలో ఉన్నా కూడ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి ప్రజా గౌరవం పొందారని కొనియాడారు. త్వరలోనే రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన కూటమి ప్రభుత్వం చేసిన ఆరాచరికాలు, అవినీతి, దౌర్జన్యాలను వివరించడం జరుగుతుందని తెలిపారు. మహిళలను విస్మరిస్తే ప్రభుత్వాలకు పుట్టగతులుండవని ఆమె అన్నారు.



- శ్రావణమాసంలో శుభకార్యాలకు మంచి ముహూర్తాలు
- రెండు నెలల విరామం అనంతరం గృహ ప్రవేశాలు, వివాహాలు
- ఒక్కటి కానున్న వేలాది జంటలు
- కళ్యాణ మండపాలు, డెకరేషన్లు, వంట మనుషులు, క్యాటరింగ్‌లకు ఒక్కసారిగా పెరిగిన డిమాండ్
- ఆలయాలు, గృహాలలో వ్రతాలు, నోములు



శ్రావణమాసం.. శుభప్రదం



ఒంగోలు మెట్రో: శ్రావణమాసం ప్రారంభం కావడంతో శుభకార్యాలు ఊపందుకున్నాయి. మంచి ముహూర్తాలు ఉండటంతో గృహ ప్రవేశాలు, వివాహాలు, వ్రతాలు, నోములతో సందడి మొదలైంది. ముఖ్యంగా వేదమంత్రాల మధ్య ఒక్కటి కానున్న నూతన జంటలకు శ్రావణమాసం స్వాగతం పలుకుతోంది. ఏప్రిల్ నెలాఖరు నుంచి గురు, శుక్ర మూడములతో వివాహ శుభకార్యాలకు ముహూర్తాలు లేకుండా పోయాయి. ఈ నెల 25 నుంచి శ్రావణమాసం ప్రారంభం కావడంతో ఆగస్టు నెలాఖరు వరకు ముహూర్తాలు ఉన్నాయి. భాద్రపద మాసం శూన్యమాసం మినహాయించి.. ఆశ్వీజమాసం నుంచి మార్గశిర మాసం వరకు వరుసగా శుభ ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఈ శుభ ముహూర్తాలలో జిల్లావ్యాప్తంగా 5000 మంది పెళ్లిపీటలు ఎక్కనున్నట్లు సమాచారం.

జోరందుకున్న వ్యాపారాలు...

శుభప్రదమైన శ్రావణమాసంలో పూజలు, వ్రతాలతో పాటు వివాహ శుభకార్య ముహూర్తాలు కలిసి రావడంతో పురోహితులు, పూల వ్యాపారులు, కళ్యాణ మండపాలు, భాజాభజంత్రీలు, డెకరేషన్ నిర్వాహకులు, క్యాటరింగ్ వాళ్లు, ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది.



ఒంగోలు కర్నూలు రోడ్డులోని ఓ వస్త్ర దుకాణంలో మహిళల సందడి

ఆయా రంగాలపై ఆధారపడి ఉపాధి పొందుతున్న వారంతా సంతోషంగా ఉన్నారు. ఒంగోలు నగరంలోని జ్యువెలరీ షాపులు, వస్త్ర దుకాణాలు, పూల కొట్లు, పచారీ షాపులు వద్ద రద్దీ మొదలైంది. ఒంగోలు నగరంలో 20 కళ్యాణ మండపాలు ఉండగా, 16 సెంట్రల్ ఏసీ కళ్యాణ మండపాలు ఉన్నాయి. మిగిలిన నాలుగు కళ్యాణ మండపాలు నాన్ ఏసీ, చిన్నపాటి కళ్యాణ మండపాలుగా ఉన్నాయి. వాటన్నింటికీ అప్పుడే బుకింగ్‌లు పూర్తయ్యాయి.

రెండు నెలల ముందుగానే బుకింగ్‌లు...

శ్రావణమాసం శుభముహూర్తాలు ఉండటంతో రెండు నెలల ముందుగానే కళ్యాణ మండపాలన్నీ బుక్ అయిపోయాయని కళ్యాణ మండపాల మేనేజర్లు తెలిపారు. దేవస్థానాలు, గృహాలలో శ్రావణమాసం సందడి నెలకొంది. అతివలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే శ్రావణ మాస వేడుకలు, పూజలు గత శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రతి ఇంటా ఆధ్యాత్మికత, పవిత్రతను కలబోసి నింపే శ్రావణ మాసాన్ని మహిళలు సంతోషంగా జరుపుకుంటున్నారు. పూజలు, వ్రతాలతో భక్తిభావాన్ని చాటుకుంటున్నారు. వారి కుటుంబాలు, స్నేహితులతో కలిసి వేడుకలు చేస్తున్నారు. పుట్టింటికి వెళ్లిన కొత్త కోడళ్లు ఈ శ్రావణ మాసానికి అత్తవారింటికి తిరిగి వస్తారు. శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే నెల 8వ తేదీ శుక్రవారం వరలక్ష్మీవ్రతం, 9వ తేదీ శనివారం రాఖీ పండుగ, 16వ తేదీ శనివారం చిన్నా పెద్ద అందరూ చేసుకునే శ్రీకృష్ణాష్టమి, 27వ తేదీ వినాయకచవితి, నాగ చతుర్థి, పుత్రదా ఏకాదశి, హయగ్రీవ జయంతి, రాఘవేంద్ర జయంతి, పొలాల అమావాస్య వంటి ముఖ్యమైన పండుగలు కూడా ఉండటంతో భక్తిశ్రద్ధలతో పూజలు ఆచరించి ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



ఒంగోలు కర్నూలు రోడ్డులోని ఓ జ్యువెలరీ షాపులో బంగారం కొనుగోలు చేస్తున్న మహిళలు



అధికంగా శుభముహూర్తాలు...

శుభకార్యాలకు రెండు నెలల విరామం అనంతరం అత్యంత శుభప్రదమైన శ్రావణమాసం రావడంతో వివాహ, గృహ ప్రవేశాలకు ముహూర్తాలు అధికంగా ఉన్నాయని డాక్టర్ వైఖానస ఆగమ ప్రవర్త వేద పండితులు పరాంకుశం కేశవాచార్యులు తెలిపారు. వివాహాలకు ఈ నెల 26, 30, 31, ఆగస్టు 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని వెల్లడించారు. ఆశ్వీజ మాసం సెప్టెంబర్ 24, 26, 27, 28, అక్టోబర్ 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 29, 30, 31, కార్తీకమాసం నవంబర్ 1, 2, 7, 8, 12, 13, 15, మార్గశిర మాసం డిసెంబర్ 22, 25, 26, 27, 29, 30 తేదీల్లో వివాహాలకు ముహూర్తాలు ఉన్నాయని వివరించారు. భాద్రపద మాసంలో ఆగస్టు నెల 21 నుంచి సెప్టెంబర్ 21వ తేదీ వరకు శూన్యమాసమని, ఆ రోజులు మినహా మిగిలిన మాసాలలో వివాహ శుభకార్యాలు చేసుకోవచ్చని తెలిపారు.

అంకమ్మతల్లి కొలుపుల్లో పాల్గొన్న బూచేపల్లి, మేరుగు



అంకమ్మతల్లి కొలుపుల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి రూరల్: మండలంలోని తొర్రగుడిపాడు గ్రామంలో జరుగుతున్న అంకమ్మతల్లి కొలుపుల్లో ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పాల్గొన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు తెల్లమేకల గాంధీ ఆహ్వానం మేరకు పూజలో పాల్గొని టెంకాయలు కొట్టి అంకమ్మతల్లి ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్‌బాబు, రామసాని సూర్యం, రైతు విభాగం మండల అధ్యక్షుడు నల్లూరి చంద్ర, దాసరి లక్ష్మీనారాయణ, కత్తి రమణారెడ్డి, డాక్టర్ బొడ్డపాటి హరిబాబు, కౌన్సిలర్లు మేకల సులోచన ఎల్లయ్య, ప్రమీల రామబ్రహ్మం, తప్పెట బాబు, శేషాద్రి, సుందరరామిరెడ్డి, మార్కు, పులి శ్రీను, కొణికి సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఐక్యతతోనే విద్యుత్ సంస్కరణలు వెనక్కి



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దయ్య

నాగులుప్పలపాడు: కార్పొరేటర్లకు రాయితీలు కల్పించి సామాన్య ప్రజలపై భారాలు మోపే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టాలంటే ప్రజల ఐక్యతతోనే సాధ్యమవుతుందని సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ మాజీ కార్యదర్శి సిద్దయ్య తెలిపారు. మండలంలోని ఉప్పుగుండూరులో రజక కళ్యాణ మండపంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినియోగదారులను కొల్లగొట్టే అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఆపాలని కోరుతూ ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బాగున్న 2 కోట్ల మీటర్లను తొలగించి అదానీ స్మార్ట్ మీటర్ల బిగింపునకు పూనుకోవడం సమంజసం కాదని విమర్శించారు. ఈపాటికే కొన్ని ప్రాంతాల్లో బిగించిన స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ బిల్లులు గతం కంటే రెట్టింపు వచ్చాయన్నారు. దాంతో సామాన్య ప్రజలు చిన్న వ్యాపార సంస్థలు తల్లడిల్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సెకీ ఒప్పందంతో 1750 కోట్లు లంచం తీసుకుని కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా స్మార్ట్ మీటర్ల బిగింపునకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు పగలగొడతామని, జగన్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడకుండా అదానీకి అనుకూలంగా అవే విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. తద్వారా స్మార్ట్ మీటర్ల బిగింపుతో ప్రజలపై భారాలు మోపుతోందన్నారు. సంపన్నులకు కొమ్ము కాస్తూ మతం పేరుతో ఉన్మాదపూరితమైన విధానాలు అవలంబిస్తున్న పాలకులను వ్యతిరేకించాలన్నారు. ప్రజలపై భారాలు మోపే విధంగా తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టాలంటే ప్రజలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు టి.శ్రీకాంత్, ఎస్.రామారావు, కాకాని సుబ్బారావు, యు.వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మెగా జాబ్‌మేళాలో నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీల ప్రతినిధులతో జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి రవితేజ

- జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి రవితేజ

మద్దిపాడు: అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఎదగాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి రవితేజ పిలుపునిచ్చారు. మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగులు ఇటువంటి జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందు స్థిరత్వం ఏర్పడితే అనంతరం లక్ష్యాలవైపు ముందుకు సాగాలన్నారు. నిరుద్యోగులకు భరోసా కల్పిస్తూ వారి చదువుకు తగిన విధంగా బహుళజాతి కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పించడానికి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా పలు కీలక రంగాలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇటీవల వచ్చిన ఏఐలో కూడా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. తమ సంస్థ ద్వారా ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న వారికి పలు బహుళజాతి కంపెనీలలో ప్లేస్‌మెంట్‌లు ఇప్పించామని ఆయన తెలిపారు. ఈక్రమంలో రూరల్ ఏరియాలో కూడా తాము శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. మద్దిపాడులో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు 87 మంది హాజరవగా, వారిలో 42 మందికి ప్లేస్‌మెంట్లు లభించాయని రవితేజ వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలు కంపెనీల ప్రతినిధులు, ఎస్‌కే బాషా, నైపుణ్యాభివృద్ధి సంస్థ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలంలోని చిలకపాడు సబ్‌స్టేషన్ పరిధిలో గల మద్దులూరు గ్రామంలో విద్యుత్ లైన్లకు మరమ్మతుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ టి.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వమిత్ర-2పై నేటి నుంచి శిక్షణ

మద్దిపాడు: స్వమిత్ర ఫేజ్–2కు ఎంపికైన అన్నంగి, ఏడుగుండ్లపాడు, గార్లపాడు, కొలచనకోట, లింగంగుంట, మల్లవరం, పెదకొత్తపల్లి, రాచవారిపాలెం, ఇనమనమెళ్లూరు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, డిజిటల్ సహాయకులు, సర్వేయర్లు, వీఆర్‌ఓలకు మద్దిపాడులో సోమ, మంగళవారాలు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్‌డీ కె.రఘుబాబు తెలిపారు. అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, ఎవరికీ మినహాయింపు లేదని ఆయన స్పష్టం చేశారు.

గృహ నిర్మాణానికి జేసీ శంకుస్థాపన



గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పట్టా అందిస్తున్న జేసీ గోపాలకృష్ణ

మద్దిపాడు: పీ–4లో భాగంగా మద్దిపాడు మండలంలోని మల్లవరం గ్రామంలో గొల్లపూడి మరియమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకున్న జేసీ గోపాలకృష్ణ.. ఆమెకు వారసత్వంగా వచ్చిన స్థలంలో గృహం నిర్మించేందుకు మంజూరు చేయించి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పేదరికం లేని సమాజమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పీ–4 పథకం ద్వారా పేదలకు అండగా నిలిచేందుకు తనవంతుగా మరియమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకున్నానని తెలిపారు. ఆ కుటుంబానికి సంబంధించి అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. మరియమ్మ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కూడా అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇంటి నిర్మాణానికి అదనంగా అయ్యే ఖర్చును తాను భరిస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఎంపీడీఓ వి.జ్యోతి, తహసీల్దార్ ఆదిలక్ష్మి, హౌసింగ్ శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



మాట్లాడుతున్న ఒంగోలు ఎంపీ మాగుంట

ఒంగోలు సిటీ: కార్గిల్ విజయ్ దివస్–2025 వేడుకలను ప్రకాశం జిల్లా మాజీ సైనికుల వెల్ఫేర్ సంఘం ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు ఆలపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పాల్గొని మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులతో పాటు వివిధ రంగాలలో సమాజానికి సేవ చేస్తున్న సీవీఆర్ ప్రసాదరావు, రజినికుమారి, గుమ్మడి వెంకట్రావు, సిరిగిరి రాజేష్ ఖన్నాను సన్మానించారు. నెప్పల్లి నాగేశ్వరరావు కార్గిల్ యుద్ధ సమయంలో జరిగిన సంఘటనలను కళ్లకుకట్టినట్లు వివరించారు. సీవీఆర్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాజేష్ ఖన్నా, నేషనల్ ఎక్స్ సర్వీస్‌మెన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ లింగాల జగన్‌రెడ్డి, గిద్దలూరు ఈసీహెచ్‌ఎస్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ లెఫ్టినెంట్ కల్నల్ అబ్దుల్ రహీం, జిల్లా మాజీ సైనికుల వెల్ఫేర్ సంఘం జనరల్ సెక్రటరీ పాశం వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులు కే బ్రహ్మయ్య, శరత్‌బాబు, రామకృష్ణారెడ్డి, కే వెంకటేశ్వర్లు, దశరధరామయ్య, ఎం.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు, జీ కోటేశ్వరరావు, డి.కోటేశ్వరశర్మ, మిలటరీ క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకట్రావు, చుండూరి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

6న చుండూరు స్మారక సభలు నిర్వహించాలి



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు వన్‌టౌన్: చుండూరు దళిత నరమేధ స్మారక సభలను ఆగస్టు 6వ తేదీ ఘనంగా నిర్వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1991 ఆగస్టు 6న గుంటూరు జిల్లా చుండూరులో మాలపల్లెను చుట్టుముట్టిన ఆగ్రవర్ణ హంతక ముఠా 10 మంది మాలలను దారుణంగా నరికి హత్య చేసిందన్నారు. ఈ సంఘటనలో అప్పటి నేదురుమల్లి ప్రభుత్వం, పోలీసుల హస్తం కూడా ఉందన్నారు. ఆ సంఘటనకు ముందురోజు పోలీసులు మాలల గృహాలను తనిఖీ చేసి కత్తులు, కత్తిపీటలను కూడా స్వాధీనం చేసుకున్నారన్నారు. అనంతరం అగ్రవర్ణాల వారు మాలలను నరికి శవాలను మూటగట్టి నదిలో పడేశారన్నారు. కనీసం 3 రోజులు నదిలోనే శవాలున్నాయన్నారు. దళితుల ఆందోళనతో ప్రభుత్వం పోస్టుమార్టం నిర్వహించిందన్నారు. న్యాయం చేయాలని నిరాహార దీక్ష చేస్తున్న చుండూరుకు చెందిన అనిల్ కుమార్‌ను పోలీసులు కాల్చి చంపారన్నారు. ఈ సంఘటనతోనే ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ యాక్టు ఆవిర్భవించిందన్నారు. సమావేశంలో పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.